
# పరివర్తన

తొటూరి రమేష్ బాబు



హెూటల్‌లో విపరీతమైన రద్దీ ఉంది. ఆరుగురు సప్లయర్లలో ఇద్దరు పని ఎగ్గొట్టడం వల్ల మిగిలిన నలుగురూ ఊపిరి సలపకుండా పనిలో ఉన్నారు. నేనూ కాష్ కౌంటర్ దగ్గర బిజీగా ఉన్నాను.

ఓ గంట గడిచాక రద్దీ పలచబడింది. సప్లై కుర్రా డొకడు - "సేర్! ఇవ్వాళ కొత్తవాళ్ళను తీస్కరాండి. పని కష్టమైతాంది" అన్నాడు.

"సర్లేరా! చిన్న సేర్ వచ్చాక, నే వెళ్ళి కొత్తవాళ్ళను తీస్కొస్తా. నువ్వు పని చూసుకో!"

చిన్న సేర్ అంటే మా తమ్ముడు. ఈలోగా తమ్ముడు వచ్చాడు. వాడు కాలేజీ నుంచి రాగానే హెూటల్ వ్యవహారం చూసుకుంటాడు. వాడు కౌంటర్లో కూర్చున్నాక, నేను కాస్త టీ తాగి క్లాక్ టవర్ పార్కు వేపు బయలుదేరాను వర్కర్ల కోసం. ఈ క్లాక్ టవర్ పార్కు పని కోసం చూసేవాళ్ళకూ, ఊరి నుంచి పారిపోయి వచ్చిన వాళ్ళకూ, నిరుద్యోగులకూ, నిరాశ్రయులకూ నిలయం. మొత్తం మీద అది బికారీల అడ్డా.

** ** **

నిజానికి నేనూ ఒకప్పుడు బికారినే. మా నాన్న విపరీతంగా తాగి సింగరేణిలో బంగారం లాంటి ఉద్యోగం ఊడగొట్టుకున్నాడు. ఊరి నిండా అప్పులు చేసి చేతు లెత్తేశాడు. గోదావరి ఖనిలో ఇక మాకు నిలవ నీడ లేకుండా పోయింది. అప్పటికి నా వయసు పదహారు సంవత్సరాలు. ఆ పరిస్థితుల్లో మా అమ్మనూ, తమ్ముణ్ణీ తీసుకుని సికింద్రాబాద్ చేరాను. స్టేషన్లో దిగి క్లాక్ టవర్ పార్కు చేరాము. అక్కడ నాలుగు రోజులు ఆకలితో అలమటించాక, ఓ హెూటల్‌లో టేబుల్స్ తుడిచే పని దొరికింది. భోజనం పెట్టి అయిదు రూపాయలు ఇచ్చేవాళ్ళు. తమ్ముడూ, నేనూ కలిసి పది రూపాయలు సంపాదించేవాళ్ళం. అమ్మ కూడా నాలు గైదు ఇళ్ళల్లో పనికి కుదిరి నెలకు రెండు వందలు సంపాదించేది.

అలా పది సంవత్సరాలు గడిచాక నేను స్వంత హెూటల్ పెట్టుకున్నాను. అదృష్టం కలిసొచ్చి నా హెూటల్‌కు పేరు వచ్చింది. ఆర్థికంగా నిలదొక్కుకున్నాను. బోయిన్‌పల్లిలో ఇల్లు కూడా కట్టాను.

ఈ మధ్య కాలంలో మా నాన్న నా అడ్రస్ వెతుక్కుంటూ వచ్చాడు. నాన్న తన ప్రవర్తన మారిందనీ, ఇక తాగడం మానేశాననీ, గోదావరి ఖనిలోనే ఓ ప్రైవేట్ కంపెనీలో గుమాస్తాగా పని చేస్తున్నాననీ చెప్పాడు. తనను కూడా మాతో కలిసి ఉండనిమ్మనీ, వృద్ధాప్యంలో ఒంటరిగా ఉండలేననీ ఎంతో బ్రతిమాలాడు.

కానీ అమ్మా, తమ్ముడూ, నేనూ ఎవ్వరం అతనితో మాట్లాడలేదు. అలా రెండు రోజు లుండి, ఆ మౌనం భరించలేక తిరిగి గోదావరి ఖని వెళ్ళిపోయాడు మా నాన్న.

** ** **

క్లాక్ టవర్ పార్కు దగ్గర స్కూటర్ ఆపి లోపలికి వెళ్ళాను.

ఓ కుర్రాడు పరుగెత్తుకుంటూ నా దగ్గరకు వచ్చి "ఏ హెూటల్ అన్నా? అన్నం పెట్టి ఎం తిస్తావ్?" అని అడిగాడు.

అక్కడ ఇది సర్వ సాధారణం. చెప్పాను. అతను ఒప్పుకున్నాడు. సిటీ బస్ ఛార్జీ ఇచ్చి అడ్రస్ చెప్పాను ఆ కుర్రాడికి. ఆ రోజే పనిలో చేరాడు అతను.

రాత్రి తొమ్మిది గంటలకు హెూటల్ మూసేశాక ఆ కుర్రాడు "అన్నా! పది రూపాయ లివ్వు!" అడిగాడు.

"ఎందుకురా? వారం తర్వాత తీసుకో, దేనికైనా పని కొస్తాయి కదా!" అన్నాను.

"గట్ల గాదన్నా. గాడ పార్కుల మా నాయిన ఉన్నడు. రెండ్రోజుల నుంచి అన్నం తినలే. గీ పైన లిస్తె మా నాయినకు అన్నం తినిపిస్త."

కదిలిపోయాను నేను. ఆ వయసులో తనను పోషించాల్సిన తండ్రినే ఆ కుర్రాడు పోషిస్తున్నాడు. నా తండ్రి గుర్తు కొచ్చాడు. మనసు భారమైంది. నా హృదయ వేదన కన్నీళ్ళ రూపంలో పెల్లుబికింది.

అప్పుడే నా కర్తవ్యం స్ఫురించింది. ఆ రాత్రే గోదావరి ఖని బయలుదేరాను నా తండ్రిని తీసుకు రావడానికి!

★